నమస్తే తెలంగాణ
సిద్ధిపేట
5 | హైదరాబాద్, మంగళవారం 9 జనవరి 2024 | SIDDIPET

అర్ధమండపంలో నిర్వహించిన మండపారాధన పూజల్లో పాల్గొన్న అర్చక దంపతులు

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన

- ముగిసిన మల్లన్న కల్యాణోత్సవం
- ఆలయ సిబ్బందికి అర్చకుల సన్మానం

చేర్యాల, జనవరి 8: కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం ఆలయవర్గాలు అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామివారికి లక్ష బిల్వార్చన, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం పూజలను నిర్వహించారు. రాష్ట్రంలోని అన్నివర్గాలు సుఖసంతోషాలతో జీవనం సాగించేందుకు స్వామివారు అనుగ్రహించాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయవర్గాలు తెలిపాయి. కల్యాణం మరుసటి రోజు ఆలయ సంప్రదాయం మేరకు లక్ష బిల్వార్చన పూజలను మల్లన్న ఆలయం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనువంశిక వీరశైవ ఆగమశాస్త్రం ప్రకారం స్వామి వారి ఆలయంలో స్వస్తిక్ పుణ్యాహవచనం, గణపతి పూజ, పంచచార్య పూజలు, రుద్రాభిషేకం, బిల్వార్చన, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, హారతి, మంత్రపుష్పం, మహానైవేద్యం తదితర పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. అంతేకాకుండా లక్ష బిల్వాలను (మారేడు) స్వామి మూలవిరాట్ వద్ద సమర్పిస్తూ 1008 మల్లన్న నామస్మరణలను పఠిస్తూ అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో బిల్వార్చన పూజలు కొనసాగించారు. పూజల్లో ఆలయ అర్చకుడు మహాదేవుని శ్రీనివాస్, మనోహర్ దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బాలాజీ, ఏఈవోలు వైరాగ్యం అంజయ్య, గంగా శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకుడు నీల శేఖర్, ఆలయ కమిటీ సభ్యుడు చిరమల్ల నర్సింహులు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కల్యాణోత్సవం

రెండు రోజుల పాటు స్వామివారి కల్యాణోత్సవాన్ని ఆలయవర్గాల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించిన ఆలయ అర్చకులు, లక్ష బిల్వార్చన, మహాన్యాసపూర్వక పూజలతో కల్యాణ వేడుకలు ముగిసినట్లు ప్రకటించారు. రానున్న సంక్రాంతి పర్వదినం అనంతరం వచ్చే మొదటి ఆదివారం రోజు పట్నం వారంతో తిరిగి జాతర ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. మొదటి ఆదివారం పట్నం వారం సందర్భంగా హైదరాబాద్ భక్తులు పట్నం, అగ్నిగుండాల కార్యక్రమాలను నిర్వహించుకుంటారని, మొదటి వారానికి సుమారు లక్ష మంది భక్తులు కొమురవెల్లికి తరలివస్తారని వారు వెల్లడించారు. స్వామివారి కల్యాణోత్సవ వేడుకలు విజయవంతంగా ముగియడంతో ఆలయవర్గాలు సంప్రదాయం మేరకు ఆలయ సిబ్బందిని ఈవో ఆధ్వర్యంలో అర్చకులు ఘనంగా సన్మానించారు.

బిల్వాలతో నిండిపోయిన 'మల్లన్న'

గర్భాలయంలో లక్షబిల్వార్చన పూజలు చేస్తున్న అర్చకులు

11 నుంచి జాతీయ యువజనోత్సవాలు

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా అధికారి రంజిత్‌రెడ్డి

సిద్దిపేట టౌన్, జనవరి 8: జాతీయ యువజనోత్సవాలను విజయవంతం చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి రంజిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 11 నుంచి 12వతేదీ వరకు జాతీయ యువజనోత్సవాలు ఘనంగా జరుపుతామన్నారు. ఇందులో భాగంగా 'మై భారత్-వికసిత్ భారత్ 2047' అనే అంశంపై జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ అసాధ్యమే!

17వరకు 'ప్రజాపాలన' దరఖాస్తుల అప్‌లోడ్ కష్టమే..

అజాగ్రత్త వహిస్తే లబ్ధిదారుడికి నష్టమే..?

ఉమ్మడి మెదక్ జిల్లాలో 10,33,543 దరఖాస్తులు

ఆన్‌లైన్‌లో నమోదు కోసం 1,766 మంది ఆపరేటర్లు

నిర్దేశించిన గడువులోగా పూర్తికాదంటున్న సిబ్బంది

సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో కట్టలు కట్టి ఉంచిన ప్రజాపాలన దరఖాస్తులు

సిద్దిపేట, జనవరి 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని గ్రామాలు, పట్టణాల్లో ప్రజాపాలన పేరిట వారం రోజుల పాటు ఆరు గ్యారెంటీలపై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల్లో ప్రధానంగా మహాలక్ష్మి పథకం కింద రూ. 2,500 ఆర్థిక సహాయం, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డులకు విరివిగా దరఖాస్తులు వచ్చాయి. రూ. 500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలు ఉన్నాయి. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో గత నెల 28 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు ప్రజల నుంచి 10,33,543 దరఖాస్తులు స్వీకరించారు. వీటన్నింటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి మొత్తం వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఆపరేటర్లతో పాటు కొంతమంది ప్రైవేట్ ఆపరేటర్లు కలుపుకొని మొత్తం 1,766 మందికి ఆన్‌లైన్ బాధ్యతలు అప్పగించింది. వీరంతా రోజూ ఒక్కొక్కరు 50 నుంచి 60 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. స్వీకరించిన అన్ని దరఖాస్తులను ఈనెల 17లోపు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఆ విధంగానే జిల్లా స్థాయిలో ఏర్పాట్లు చేశారు. డేటా ఆపరేటర్లకు సైతం శిక్షణ ఇచ్చారు. కానీ నిర్దేశించిన సమయానికి డేటా ఎంట్రీ పూర్తి అవుతుందనే నమ్మకం లేదని కొంతమంది డేటాఎంట్రీ ఆపరేటర్లు బాహాటంగానే చెబుతున్నారు. జిల్లాల కలెక్టర్లు రోజు వారీగా సమీక్షిస్తున్నారు. ఆపరేటర్ ఏమాత్రం అజాగ్రత్తగా నమోదు చేసినా లబ్ధిదారుడు నష్టపోవాల్సిందే. దీనికి తోడు సర్వర్ సమస్య కూడా తోడవుతుంది. పదే పదే లాగిన్ చేయాల్సిన పరిస్థితులు ఉంటున్నాయి. ఆధార్ నంబర్ నమోదు చాలా జాగ్రత్తగా చేయాల్సి ఉంటుంది. వీటన్నింటిని పరిగణలోకి తీసుకోకుండా చేస్తే లబ్ధిదారులకు నష్టం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ మరో సమస్య కూడా ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. దీనిని అదునుగా భావించి సైబర్ నేరగాళ్లు చొరబడే అవకాశాలు కూడా ఉన్నాయి. ప్రతిదీ జాగ్రత్తగా చేయాలంటే నిర్దేశించిన గడువులోగా డేటా ఎంట్రీ కావడం అసాధ్యమే అని చెప్పాలి.

ఆన్‌లైన్ సాధ్యమేనా?

ప్రజాపాలనలో భాగంగా ప్రతి వంద మందికి ఒకటి చొప్పున గ్రామాల్లో కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రజల నుంచి వారం రోజుల పాటు దరఖాస్తులు స్వీకరించారు.

జిల్లాల వారీగా దరఖాస్తులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు

జిల్లా పేరు	వచ్చిన దరఖాస్తులు	ఆపరేటర్లు
సిద్దిపేట	3,76,387	684
మెదక్	2,73,389	480
సంగారెడ్డి	3,83,767	602
మొత్తం	10,33,543	1,766



సిద్దిపేట మున్సిపల్‌లో ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది

స్వీకరించిన దరఖాస్తులను ఈనెల 17లోపు డేటా ఎంట్రీ చేసేలా జిల్లాల్లో ఆపరేటర్లకు బాధ్యతలు అప్పగించారు. సిద్దిపేట జిల్లాలో 684 మంది, మెదక్ జిల్లాలో 480 మంది, సంగారెడ్డి జిల్లాలో 602 మంది మొత్తం ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,766 మంది వివిధ శాఖల్లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లతో పాటుగా మరికొంది మంది ప్రైవేట్ ఆపరేటర్లు ఉన్నారు. వీరందరికీ శిక్షణ ఇచ్చి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ముమ్మరం చేశారు. ప్రతి ఆపరేటర్ రోజుకు 50 నుంచి 60 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. 27 అంశాలను పథకాల వారీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఒక దరఖాస్తుకు రూ. 5 చొప్పున, ప్రైవేట్ ఆపరేటర్‌కు రూ. 15 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం నగదు చెల్లిస్తుంది. నిర్దేశించిన సంఖ్యకు అదనంగా ఎట్టి పరిస్థితుల్లోనూ చేయడానికి వీలు లేదు. సిద్దిపేట జిల్లాలో మొత్తం 3,76,387 దరఖాస్తులు రాగా. వీటిలో ఐదు గ్యారెంటీలకు 3,19,261, ఇతర విభాగాలకు సంబంధించినవి 57,126 వచ్చాయి. వీటిని ఆన్‌లైన్ ప్రక్రియను 684 మంది ఆపరేటర్లతో చేపడుతున్నారు. మెదక్ జిల్లాలో 2,73,389 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 2,23,357 దరఖాస్తులు ఆరు గ్యారెంటీలవి కాగా ఇతర సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు 50,032 వచ్చాయి. వీటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడానికి జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న 480 మంది కంప్యూటర్ ఆపరేటర్లకు బాధ్యతలు అప్పగించి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను చేపట్టారు. సంగారెడ్డి జిల్లాలో 3,83,767 దరఖాస్తులు స్వీకరించారు. వీటిలో రేషన్ కార్డులకు 58,599 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. వీటన్నింటిని ఆన్‌లైన్ నమోదు చేయడానికి 602 డేటా ఎంట్రీ ఆపరేటర్లను ఏర్పాటు చేసి ఆన్‌లైన్ ప్రక్రియను ముమ్మరం చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్

సిద్దిపేట అర్బన్, జనవరి 8: జిల్లాకు చెందిన ఉన్నతాధికారులు నేరుగా ప్రజల సమస్యలు విని పరిష్కరించడానికి మొదలుపెట్టిన గొప్ప కార్యక్రమం ప్రజావాణి అని అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆమె అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యలు నేరుగా విన్నవించి పరిష్కరించుకోవడానికి అర్జీదారులు ఎంతో ఆశతో కార్యాలయానికి వస్తారని.. వారందరికీ న్యాయం చేయడం అధికారులుగా మన కర్తవ్యం అని అధికారులకు సూచించారు. అర్జీదారుల నుంచి తీసుకున్న ఫిర్యాదులు త్వరగా పరిష్కరించి నివేదిక అందజేయాలన్నారు అర్జీదారులకు ప్రజావాణి కార్యక్రమంపై నమ్మకం పెరిగిందని, క్రమక్రమంగా అర్జీదారుల సంఖ్య పెరుగుతుండడంతో అధికారులు ఎంతో ఉత్సాహంతో పనిచేయాలన్నారు. వివిధ సమస్యలపై 24 దరఖాస్తులు అందాయని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌వో నాగరాజమ్మ, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు గరిమాఅగర్వాల్, శ్రీనివాస్‌రెడ్డి

రూరల్ జీపీల్లో 'ఎస్‌వీఎంపీ' అమలు

సిద్దిపేటరూరల్, జనవరి 8: సిద్దిపేట రూరల్ మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో సీజీఐ ద్వారా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం (ఎస్‌వీఎంపీ) అమలు కానుంది. ఇందులో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన స్టాల్‌ను అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ పరిశీలించారు. మూడేండ్ల వ్యవధి గల ఈ ప్రాజెక్టుకు సాహస్ అనే సంస్థ మద్దతు ఇస్తోంది. రాబోయే రోజుల్లో బ్లాక్‌లను విస్తరింపజేయనున్నారు. ప్రజాపాలనలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో స్టాల్ ఏర్పాటు చేయడంతో పాటు సాహస్ సభ్యులు ప్రజలకు ప్యాకెట్ క్యాలెండర్‌ను పంపిణీ చేస్తోంది. ఇందులో వ్యర్థాలను పారబోయడం వల్ల కలిగే ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

హుస్నాబాద్ క్యాంపు కార్యాలయంలో సతీసమేతంగా పూజలు చేస్తున్న మంత్రి పొన్నం

ప్రజలకు అందుబాటులో ఉంటా

- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి పొన్నం గృహప్రవేశం
- ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం కార్యకర్తలతో సమావేశం

హుస్నాబాద్, జనవరి 8: హుస్నాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం గృహప్రవేశం చేశారు. ఉదయం నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మంత్రి సతీ సమేతంగా పాల్గొన్నారు. అనంతరం స్థానిక కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. ఇక నుంచి క్యాంపు కార్యాలయం నుంచే నియోజకవర్గ పాలనా వ్యవస్థను చూడటం జరుగుతుందని మంత్రి తెలిపారు. కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తానన్నారు. ప్రజలకు ఏ సమస్య ఉన్నా నేరుగా తన క్యాంపు కార్యాలయానికి వచ్చి కలుసొచ్చన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, నాయకులు అయిలయ్య, కల్లెపల్లి వెంకటస్వామి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి తూర్పార యంత్రాలు

గజ్వేల్, జనవరి 8: గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు మొదటిసారి తూర్పార యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. ధాన్యంలో దుమ్ము, ధూళి, తాలును వేరు చేసుకునేందుకు వీలుగా ఈ తూర్పార యంత్రాలను వినియోగిస్తారు. గతంలో పొలాల వద్ద రైతులు ఎన్నో ఇబ్బందులు పడి ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకువచ్చే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం కరెంట్‌తో నడిచే ఎనిమిది తూర్పార యంత్రాలు, వడ్లను జల్లించేందుకు వీలుగా మారో యంత్రాన్ని సమకూర్చారు.

గజ్వేల్ మార్కెట్‌లో తూర్పార యంత్రాలు

కలెక్టర్ వీజే పాటిల్‌కు పూలమొక్క అందజేస్తున్న సీపీ అనురాధ

పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న సీపీ అనురాధ

సీపీగా బాధ్యతలు స్వీకరించిన అనురాధ

- కలెక్టర్, జడ్జీలను కలిసిన సీపీ

సిద్దిపేట అర్బన్, జనవరి 8 : సిద్దిపేట నూతన పోలీస్ కమిషనర్‌గా బి.అనురాధ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు పోలీసుల నుంచి ఆమె గౌరవ వందనం స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీపీ అనురాధను అడిషనల్ డీసీపీలు అందె శ్రీనివాసరావు, మల్లారెడ్డి, ఏఆర్ అడిషనల్ డీసీపీలు రామచంద్రరావు, సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు సురేందర్‌రెడ్డి, రమేశ్, సతీశ్, ఎస్బీ ఏసీపీ రవీందర్‌రాజు, ట్రాఫిక్ ఏసీపీ ప్రసన్నకుమార్, పలువురు సీఐలు, ఎస్సైలు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ, ఏసీపీలతో సమీక్ష నిర్వహించిన సీపీ అనురాధ.. జిల్లా భౌగోళిక పరిస్థితులు, ఏ తరహా నేరాలు ఎక్కువగా నమోదవుతున్నాయి.. తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. 2017 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన బి.అనురాధ ఇప్పటివరకు రాచకొండ కమిషనరేట్ పరిధిలో సైబర్ క్రైమ్ డీసీపీగా విధులు నిర్వహించారు. ఇప్పటివరకు విధులు నిర్వహించిన సీపీ శ్వేత.. హైదరాబాద్ సైబర్ క్రైం డీసీపీగా బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే.

మర్యాదపూర్వకంగా కలిసిన సీపీ

సిద్దిపేట పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన బి.అనురాధ అనంతరం కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేయాలని సీపీ అనురాధకు కలెక్టర్ సూచించారు. సిద్దిపేట జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి డా.టి.రఘురామ్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న సీపీ అనురాధ

ధాన్యాన్ని మిల్లింగ్ జరిపించాలి

- రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చూడాలి
- మిల్లింగ్ త్వరగా జరిపించి ఎఫ్‌సీఐకి ధాన్యం చేరవేయాలి
- వీడియో కాన్ఫరెన్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సిద్దిపేట అర్బన్, జనవరి 8: రైస్ మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని వేగవంతంగా మిల్లింగ్ జరిపించి.. కోటా మేరకు భారత ఆహార సంస్థకు బియ్యం నిల్వలు చేరవేసేలా పర్యవేక్షణ చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి జిల్లాల కలెక్టర్లు, పౌరసరఫరాలశాఖ అధికారులతో ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటరీకరణ, యాసంగిసాగు, వానకాలం మిల్లింగ్ రైస్ తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పౌర సరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైస్‌మిల్లులను అధికారులు నిరంతరం సందర్శిస్తూ.. పూర్తిస్థాయిలో మిల్లింగ్ జరిగేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. కేటాయించిన ధాన్యం నిల్వలను పరిశీలించాలని.. ఎక్కడైనా పక్కదారి పట్టించి.. అక్రమాలకు పాల్పడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా నిఘా ఉంచాలన్నారు. ప్రజాపాలన కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తులను సకాలంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సీఎస్ శాంతికుమారి కలెక్టర్లకు సూచించారు. నిర్ణీత గడువులోపు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అదనపు కలెక్టర్(రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి, సీఎస్